ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 కర్నూలు జిల్లా వార్తలు

మంగళవారం 26 మార్చి 2024

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(మంగళవారం)	సెహరీ(బుధవారం)
కర్నూలు	6:35 (సాయంత్రం)	4:55 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:32 (సాయంత్రం)	5:07 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	4:55 (ఉదయం)



ఆనందాల హోలీ

- వేడుకల్లో సందడి చేసిన యువకులు, చిన్నారులు
- కిసాన్ ఘాట్‌లో ఉత్సాహంగా సాగిన 'హోలీ బ్లాస్ట్' ఈవెంట్

కర్నూలు(కల్చరల్), మార్చి 25: రంగుల వేడుక 'హోలీ'ని సోమవారం నగర వాసులు ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచే వేడుకల సందడి కనిపించింది. చిన్నారులు, యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. సిద్ధం చేసుకున్న విభిన్న రంగులను నీళ్లలో కలుపుకొని, పిచికారీ పంపులతో చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. నగర భజరంగ్‌దళ్ శాఖ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. భజరంగ్‌దళ్‌తోపాటు వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. హోలీ వేడుకల సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి రంగులు చల్లుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ రామ మందిర నిర్మాణం జరిగిందని, రామరాజ్య స్థాపన, దేశ ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ టి. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ దేశ సంస్కృతిలో భాగమైన హోలీ వేడుకల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఈ సంబరాల్లో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి, నగర అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, జిల్లా సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు, రాము, భగీరథ, హరి, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొని నగర ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.





రంగులు పూసుకుంటున్న యువతీ యువకులు



పాత నగరంలో హోలీ వేడుకలు..

పాత నగరంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా గుజరాత్, రాజస్థాన్, యూపీ తదితర రాష్ట్రాల మార్వాడీలు ఉన్న ప్రాంతాల్లో హోలీ సంబరాలు ఉత్సాహంగా సాగాయి. వన్‌టౌన్ మఠం వీధి, చిత్తారి వీధి, కుమ్మరి వీధి, రాంభొట్ల దేవాలయం తదితర ప్రాంతాల్లో చిన్నారులు, మహిళలు హోలీ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అలరించిన 'హోలీ బ్లాస్ట్' ఈవెంట్ సంబరాలు..

నగరంలోని కిసాన్ ఘాట్‌లో యాన్సన్ అండ్ ఫన్‌అండ్‌ఫుడ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోలీ బ్లాస్ట్ ఈవెంట్ సంబరాలు అసాంతం అలరింపజేశాయి. ఈ వేడుకల్లో యువకులు, చిన్నారులు ప్రత్యేకంగా రంగులు చల్లుకుంటూ గడిపారు. హోలీ రోజున సెలవు కావడంతో ఈ వేడుకల్లో నగరంలోని వివిధ కళాశాలల యువత పెద్ద సంఖ్యలో హాజరైంది. డీజీ మ్యూజిక్, రెయిన్ డ్యాన్స్, వాటర్ బెలూన్స్, ఫూల్ ఫర్ కిడ్స్ వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 800 మందికి పైగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగిన ఈ వేడుకల్లో నిర్వాహకులు షేక్ బషీర్ అహ్మద్, కిషోర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



చిన్నారుల కేరింతలు





యువకుల కేరింతలు



రంగులు పూసుకుంటూ..



ఇప్పుడో సెల్ఫీ..

రబీ నష్టం రూ.71.57 కోట్లు



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 25: తీవ్ర వర్షాభావం వల్ల రైతులకు జరిగిన పంట నష్టాన్ని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపామని కర్నూలు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి సోమవారం తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఖరీఫ్‌లో 30 మండలాల్లోని రైతులకు జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వం ఇటీవలనే రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిందని వివరించారు. రబీ సీజన్‌లో కూడా వర్షాభావ పరిస్థితుల వల్ల కర్నూలు రూరల్, అర్బన్‌లలో కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు, గూడూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి, హొళగుంద, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి, సి. బెళగల్ మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వానికి నివేదికను పంపామని తెలిపారు. ఈ మండలాల్లో 58,901 మంది రైతులకు 70,902.46 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని జేడీ వరలక్ష్మి తెలిపారు. ఈ రైతులకు రూ.71.57 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు స్పష్టం చేశారు. పప్పుశనగ 37,843 హెక్టార్లు, మినుములు 775 హెక్టార్లు, మొక్కజొన్న 2,474 హెక్టార్లు, కొర్ర 1147 హెక్టార్లు, వేరుశనగ 2,731 హెక్టార్లు, పొగాకు 3,600హెక్టార్లు, జొన్న 9,252 హెక్టార్లు, మినుములు 775 హెక్టార్లు, సజ్జ 379 హెక్టార్లలో నష్టం జరిగిందని జేడీ వరలక్ష్మి తెలిపారు.

అసంపూర్తిగా పత్తికొండ జలాశయం

ఓట్లు ఎలా అడుగుతారు?

- హంద్రీ నీవా కాలువపై ఐదేళ్ల నిర్లక్ష్యం
- అసంపూర్తిగా పత్తికొండ జలాశయం
- రూ.161 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్ల ప్రతిపాదన
- ఒక్కపైసా ఇవ్వని జగన్ ప్రభుత్వం
- చేపల చెరువుగా మార్చేసిన వైనం
- ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు కోసం వస్తారు?
- ప్రశ్నిస్తున్న పల్లె జనం



(కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

ఐదేళ్లలో గంపెడు మట్టి తీయలేదు. సిమెంట్ కాంక్రీట్ వేయలేదు. కళ్లెదుటే కృష్ణా జలాలు అనంతపురం జిల్లాకు తరలిపోతుంటే కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి. పత్తికొండ (పందికోన) జలాశయం సహా కుడి ఎడమ కాలువలు అసంపూర్తిగా ఉండిపోయాయి. అధికార పార్టీ నాయకులు పల్లెకొచ్చిన ప్రతిసారి ప్రజలు మొరపెట్టుకున్నారు. అయినా పట్టించుకోలేదు. ఇప్పుడొచ్చి ఓట్లెలా అడుగుతారు..? హంద్రీ నీవా కాలువ ఆయకట్టు గ్రామాల రైతుల ప్రశ్న ఇది. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల నెలకొన్న కరువు రైతులకు శాపంగా మారింది. అసంపూర్తి పనులు చేయకపోగా.. రూ.80 కోట్లతో ఆరు వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా పత్తికొండ జలాశయం నుంచి ఎత్తిపోతల పథకానికి టెంకాయ కొడతానని గతేడాది జూన్ ఒకటిన సీఎం జగన్ ఇచ్చిన హామీ ఎండమావే అయింది. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఓట్ల కోసం గ్రామాలకు వెళ్తున్న అధికార వైసీపీ నాయకులను ఏ ముఖం పెట్టుకొని ఓట్ల కోసం వచ్చారంటూ ప్రజలు సంధించే ప్రశ్నలకు సమాధానం లేదని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి.

రాయలసీమ జిల్లాల కరువు నేలకు కృష్ణా జలాలు మళ్లించాలని 1983లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్టీఆర్ తెలుగుగంగ, హంద్రీనీవా ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. శ్రీశైలం ఎగువన కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించేలా 2004లో ఆనాటి ప్రభుత్వం నిధులు, పరిపాలన అనుమతులు ఇచ్చింది. మాల్యాల నుంచి 40 టీఎంసీలు ఎత్తిపోయాలని లక్ష్యం. ఫేజ్-1 కింద ఉమ్మడి కర్నూలు జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, జిల్లాలో కృష్ణగిరి, పత్తికొండ జలాశయాలు, అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయరు నిర్మించారు. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాలు ఎలాంటి సాగునీటి వనరులు లేని కరువు ప్రాంతం. హంద్రీ నీవాలో భాగంగా పత్తికొండ జలాశయం నిర్మించారు. ఈ రిజర్వాయర్ కింద 60 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకుంటే.. అసంపూర్తి పనులు వల్ల 20-25 వేల ఎకరాలకు కూడా నేరుగా సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది. పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాల్సిన సీఎం జగన్ ప్రభుత్వం, పత్తికొండ, ఆలూరు ఎమ్మెల్యేల నిర్లక్ష్యం కష్టజీవులకు శాపంగా మారింది.



● ఒక్కపైసా ఇవ్వలేదు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో హంద్రీనీవా కాలువ కింద 7.5 టీఎంసీలు నీటిని వినియోగించుకొని 80 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. పత్తికొండ (పందికోన) జలాశయం కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో 50,620 ఎకరాలు, ఎడమ కాలువ (ఎల్‌బీసీ) పరిధిలో 10,774 ఎకరాలు కలిపి 61,394 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. రిజర్వాయర్ రివెట్మెంట్ సహా ఎడమ కాలువల పరిధిలో సింగిల్ లైన్ బిడ్జి (ఎస్ఎల్‌బీ), ఆర్‌బీసీ, ఫీల్డ్ చానల్స్ డిస్ట్రిబ్యూటరీలు, కుడి కాలువ (ఆర్‌బీసీ) పరిధిలో దేవనకొండ, ఆస్పరి మండలాల్లో డిస్ట్రిబ్యూటర్లు, ఫీల్డ్ చానల్స్, ఆర్అండ్‌బీ క్రాసింగ్ బిడ్జీలు, ఎల్‌బీసీ వంటి నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేస్తే 61 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు.. రూ.161 కోట్లు ఇవ్వమని ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపితే ఒక్క పైసా కూడా జగన్ ప్రభుత్వం ఇవ్వలేదు.

అధికారులతో కుమ్మక్కై..

పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీరు అందించాల్సిన పత్తికొండ రిజర్వాయర్‌ను వైసీపీ నాయకులు చేపల చెరువుగా మార్చేసి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. చేపల పెంపకంపై ఉన్న శ్రద్ధ అసంపూర్తి పనులపై లేదని అంటున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం 1.126 టీఎంసీలు కాగా.. 0.85 టీఎంసీలకు మించి నిల్వ చేసుకోలేని పరిస్థితి ఉంది. ఈ ఏడాది చేపల వేలం పాటల్లో వైసీపీ నాయకులు, మత్స్య శాఖ అధికారులు కుమ్మకై గత ఏడాది కంటే కేవలం రూ.800 మాత్రమే పెంచి వైసీపీ నాయకులు సొంతం చేసుకున్నారు.



కర్నూలు జిల్లా హంప వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ

కళ్ల ముందే వదిలేశారు

శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ నీవా కాలువకు 40 టీఎంసీలు ఎత్తిపోస్తే అందులో 7.5 టీఎంసీలు (18.75 శాతం) కర్నూలు జిల్లా వాటాగా వాడుకునే హక్కు ఉంది. ఈ ఏడాది (2023-24 నీటి సంవత్సరం) హంద్రీ నీవా కాలువ ద్వారా 29 టీఎంసీలు ఎత్తిపోశారు. అందులో జిల్లా వాటాగా 5.43 టీఎంసీలు వాడుకునే హక్కు ఉంది. నీటి నిల్వ చేసేందుకు పత్తికొండ జలాశయం పూర్తి కాలేదు. ఆయకట్టు పొలాలకు మళ్లిద్దామంటే పంట కాల్వలు, డిస్ట్రిబ్యూటర్లు అసంపూర్తిగా ఉన్నాయి. పైగా ప్రభుత్వంలో కీలకంగా ఉన్న మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాల మేరకు ఇంజనీర్లు చిత్తూరు జిల్లాకు తరలించారు. ఫలితంగా కేవలం 2.75 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని ఇంజనీర్లు తెలిపారు. ఈ లెక్కన 2.68 టీఎంసీలు వాడుకోలేని దైన్యం. కళ్ల ముందే నీళ్లు ఉన్నా.. కాల్వలు లేకపోవడంతో దిగువకు వదిలేయాల్సిన వచ్చింది. అదే నీటిని పంట చేలకు మళ్లించి ఉంటే సరాసరి 30 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉండేది.

నీళ్లిచ్చే నాయకులకే మా ఓటు!

అసంపూర్తి పనులు పూర్తి చేసి పత్తికొండ రిజర్వాయర్ కింద సాగునీరు ఇవ్వమని పదేపదే అడుగుతున్నా నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. నీళ్లు ఇవ్వని నాయకులకు మా ఓట్లు కావాలా? అని రిజర్వాయర్ కుడి, ఎడమల కాల్వల కింద ఆయకట్టు ఉన్న కొత్తపల్లి, దూదేకొండ, పులికొండ, దేవనకొండ, నేలతలమారి, కుంకనూరు, కరివేముల, కప్పట్రాళ్ల తదితర గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. హంద్రీనీవా కాలువలు పూర్తి చేసి సాగునీరు ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే అభ్యర్థులకే ఓటు వేస్తామని అంటున్నారు. ఇప్పటికే వైసీపీ నమ్మి మోసపోయామని, మళ్లీ ఆ తప్పు చేయలేమని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన ఉపాధి కూలి

- ఏప్రిల్ 1 నుంచి అమలు
- కొత్త సాఫ్ట్‌వేర్‌తో వేసవి భత్యానికి ఎసరు



కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 25: ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు దినసరి కూలి పెంచాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు జాబ్‌కార్డులు కలిగి ఉన్న ఐదున్నర లక్షల మంది కూలీల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు అంటున్నారు. అయితే ఎంత పెరిగేదీ ఇంకా స్పష్టత ఇంకా రాలేదు. కేంద్ర ప్రభుత్వం 2005లో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. అప్పుడు దినసరి కూలీ రూ.87.50 ఉండగా.. ప్రస్తుతం రూ.272 చెల్లిస్తున్నారు. వేసవిలోని మార్చి, ఏప్రిల్, మే మూడు నెలల పాటు ఉపాధి పనులు చేసేందుకు గ్రామాల్లో వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలు ఉదయం, సాయంత్రం, రెండు పూటలా పనులు చేసుకోవడానికి అవకాశం ఉంది.

● వేసవి భత్యానికి ఎసరు: గతంలో ఉపాధి కూలీలకు వేసవి భత్యం ఇచ్చేవారు. మార్చి నుంచి జూన్ వరకు 15 నుంచి 30 శాతం వేసవి భత్యాన్ని కూలీలు పొందేవారు. ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం భత్యం దక్కేది. ఏపీ ప్రభుత్వం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలు చేసినప్పుడు వేసవి భత్యాన్ని క్రమం తప్పకుండా కూలీలకు అందించేవారు. కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట కొత్త సాఫ్ట్‌వేర్‌ను అమలులోకి తెచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన వివరాలు పొందుపరచకపోవడం వల్ల ఉపాధి పనులు చేస్తున్న కూలీల నోట్లో మట్టి పడింది. 2022లో రూ.12, 2023లో రూ.15 కూలీని పెంచుకుంటూ వచ్చారు. ఈ ఏడాది ఎంత పెంచుతారో స్పష్టం చేస్తూ ఇంకా ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం పనులు చేసే ప్రదేశాల్లో ఎండవేడిమి తట్టుకోలేక కూలీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. నీడ కోసం డేరాలు ఏర్పాటు చేయడంతో పాటు నీటి వసతి కూడా మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కల్పించింది. టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని కూలీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మొర పెట్టుకుంటున్నారు.

వచ్చే నెల నుంచి వర్తింపు

గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం దినసరి కూలిని ఏప్రిల్ 1 నుంచి పెంచే అవకాశం ఉంది. ఎంత మొత్తం పెంచేదీ స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా వివరాలు వెల్లడించలేదు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే కూలీలకు అదనపు కూలి చెల్లిస్తాము. కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తే పని చేసే చోట వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

- అమర్నాథ్ రెడ్డి, డ్వామా పీడీ




చీరెలు కట్టిన మగవారు

- హోలీ వేడుకలో ఆచారం
- కోరికలు తీరాలంటే కొంగు కట్టాల్సిందే
- సంతెకుడ్లూరు సాంప్రదాయం



ఆదోని రూరల్/ఆదోని మార్చి 25 : హోలీ రంగుల పండుగ ఆదోని మండలం సంతెకుడ్లూరు గ్రామంలో విభిన్నంగా జరుగుతుంది. ఈ వేడుకలో కోరికలు తీరాలంటే మగవారు చీరెలు కట్టి గ్రామంలో వెలసిన రతీమన్మథులను పూజిస్తారు. సోమవారం హోలీ సందర్భంగా గ్రామంలో పలువురు మగవారు ఇట్లా స్త్రీ వేషధారణలో రతీ మన్మథులను పూజించారు. రెండురోజులపాటు గ్రామంలో రతీ మన్మథుల రథోత్సవం, కామదహనం మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. గ్రామంలో పేద రైతు అయినా, భూస్వామి అయినా, ప్రభుత్వ ఉద్యోగి అయినా చీరె కట్టి, గాజులు వేసుకొని, నుదుటిన బొట్టు పెట్టుకొని, సిగలో పూలు, మెడలో నగలు ధరించి రతీమన్మథులను పూజిస్తారు. బైటి వాళ్లకు ఇది వింత ఆచారం అనిపించినా స్థానికులకు మాత్రం పవిత్ర కార్యం. కొన్ని దశాబ్దాలుగా గ్రామమంతా కుల మతాలకతీతంగా ఈ ఆచారం కొనసాగిస్తున్నారు. గ్రామం సంతోషంగా ఉండాలన్నా, కుటుంబం కష్టాల నుంచి గట్టెక్కాలన్నా, పంటలు బాగా పండాలన్నా, ప్రభుత్వ ఉద్యోగం రావాలన్నా, మగ పిల్లలు జన్మించాలన్నా మగవారు ఇట్లా రతీ మన్మథులను పూజించడం ఇక్కడి ఆచారం.







ప్రభుత్వ ఉద్యోగం రావాలని

నేను అమరావతిలో బి.టెక్ చదువుతున్నా.. 15 సంవత్సరాలుగా చీర ధరించి ప్రతి ఏడాది స్వామిని దర్శించుకుంటున్నాను. నాతోపాటు నా కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని, నాకు ప్రభుత్వ ఉద్యోగం రావాలని దేవున్ని కోరుకున్నా. -మంజునాథ, బీటెక్ విద్యార్థి, సంతెకుడ్లూరు

ఆరోగ్యం కుదుటపడిందని..

నాకు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు అనారోగ్యానికి గురయ్యాను. మా అమ్మ గాయత్రి, నాన్న నాగరాజు ఆసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు బతకడన్నారు. నా కొడుకు ఆరోగ్యం బాగు చేయాలని మా అమ్మ, నాన్న రతీ మన్మథులను వేడుకున్నారు. అప్పుడు నా ఆరోగ్యం కుదుట పడింది. 17సంవత్సరాలుగా ప్రతి ఏడాది చీర కట్టుకొని స్వామిని దర్శించుకుంటున్నాను.
-ఆశోక్, సంతెకుడ్లూరు

మూర్ఛ వ్యాధి నయమైంది

నా వయస్సు 48 సంవత్సరాలు. 43 ఏళ్లుగా చీర కట్టి స్వామిని దర్శించుకుంటున్నాను. నాకు ఐదేళ్ల ఉన్నప్పుడు మూర్ఛవ్యాధి వచ్చింది. అప్పుడు మా అమ్మ రామమ్మ రతీమన్మథులను మొక్కుకొంది. అప్పటి నుంచి ప్రతి ఏడాది హోలీ రోజున చీర కట్టి పూజిస్తున్నాన ఇప్పటి వరకు నాకు మళ్లీ మూర్ఛ వ్యాధి రాలేదు.
కేశవరెడ్డి, రైతు, సంతెకుడ్లూరు

నీట్‌లో ర్యాంకు రావాలని

ఇంటర్ సెకండియర్ పూర్తయింది. ఎంసెట్, నీట్ ఎగ్జామ్ సన్నద్ధమవుతున్నా. నీట్‌లో ర్యాంకు రావాలని రతీ మన్మథులను కోరుకున్నాను. ఉద్యోగం కూడ రావాలని స్వామిని మగువ రూపంలో పంజాబీ డ్రస్సు ధరించి పూజించాను.
-ప్రశాంత్, విద్యార్థి, సంతెకుడ్లూరు

కొడుకు పుడితే చీరె కట్టిస్తానని మొక్కుకున్నా

రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి ఆంజనేయులుతో నాకు వివాహమైంది. మాకు మొదటి సంతానం కొడుకు జన్మిస్తే మా అబ్బాయి స్త్రీ వేషధారణలో దర్శించుకుంటాడని రతీమన్మథులకు మొక్కుకున్నా. మొదటి సంతానం నిఖిల్ ప్రతాప్ రాణా. ఈ రోజు స్వామిని మగువ రూపంలో నా కొడుకు మొక్కుబడి తీర్చుకున్నాడు.
-శాంతి, ఆర్మీ ఉద్యోగి భార్య, సంతెకుడ్లూరు



ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీతో గ్రామ వలంటీర్లు

ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా



ఆళ్లగడ్డ ఎమ్మెల్యేతో గ్రామ వలంటీరు రాజు

రుద్రవరం, మార్చి 25 : రుద్రవరం గ్రామానికి చెందిన రాజు, వెంకటేశ్వర్లు అనే వలంటీర్లు ఆదివారం సాయంత్రం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ వలంటీర్లను రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఎన్నికల కమిషన్ చెబుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

కోడుమూరు (రూరల్), మార్చి 25: వెల్దుర్తి-లద్దగిరి గ్రామాల మధ్య ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. కోడుమూరుకు చెందిన గుంటెప్ప, ఆదిలక్ష్మి దంపతులు వారపుసంతల్లో కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్నారు. ఆదివారం సొంత ఆటోలో కూరగాయలు తీసుకుని వెల్దుర్తి సంతకి వెళ్లారు. అక్కడ కూరగాయలు విక్రయించి రాత్రి మిగిలిన కూరగాయలను ఆటోలో వేసుకుని స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలో హంద్రీనీవా కాలువ సమీపాన రోడ్డుపై కుక్క అడ్డు రాగా దాన్ని తప్పించబోగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో మీద పడడంతో గుంటెప్ప తలకు తీవ్రగాయాలయ్యాయి. ఆదిలక్ష్మికి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వస్తున్న ప్రయాణికులు వారిని 108 వాహనంలో వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే గుంటెప్ప మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని అప్పగించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, కుమార్తె సంతానం. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల దొంగలు అరెస్టు

బనగానపల్లె, మార్చి 25: బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామ సమీపంలోని పలుకూరు ఆర్చీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు దొంగలను గొర్రెల గుర్తించి అరెస్టు చేసినట్లు బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి, ఎస్ఐ తిరుపాలు సోమవారం తెలిపారు. తాము పలుకూరు ఆర్చీ వద్ద ఎన్నికల విధుల్లో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా అనంతపురం జిల్లాకు చెందిన ఎరుకలి నారాయణస్వామి, ఎరుకలి నరేంద్ర, దాసరి లోకేశ్ కారులో నాటుసారా సరఫరా చేస్తుండగా కారుతో సహా నాటుసారాను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసినట్లు తెలిపారు. నందివర్గం, శిరివెళ్ల మండలాల్లో గొర్రెలను దొంగిలించి బనగానపల్లె మండలంలోని రామకృష్ణాపురం కొండల్లో దాచి ఉంచినట్లు వారు నేరం ఒప్పుకున్నారని, వారిని అరెస్టు చేసి గొర్రెలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

వరదలా టీడీపీలోకి వలసలు

- పార్టీలో పెరిగిన జోష్
- డీలా పడుతున్న వైసీపీ శ్రేణులు
- ఒక్కరోజే 85 వైసీపీ కుటుంబాలు చేరిక



కరెంట్ ఆఫీస్ ఏరియాకు చెందిన 45 వైసీపీ కుటుంబాల వాళ్లకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 25: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి రోజు రోజుకూ వలసలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో జాతర వాతావరణం నెలకొంది. టీడీపీ కార్యకర్తల్లో జోష్ రెట్టింపైంది. సోమవారం ఒక్కరోజే 85 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. సోమవారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో మండలంలోని ఫతేనగర్ గ్రామానికి చెందిన అక్కన్నగారి గంగన్నకుమారుడు రమేశ్, ఎల్లాకృష్ణ, చెన్నారెడ్డి, గుండుమద్దయ్య, గోపాల్, పర్లపాటిశివుడు, భాస్కరయ్య, రాజు, నారాయణ తదితర 16 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే బనగానపల్లె పట్టణంలోని కొండపేటకు చెందిన 14 కుటుంబాలు బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామానికి చెందిన 10 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. అలాగే బనగానపల్లె పట్టణంలోని కరెంట్ ఆఫీసు ఏరియాకు చెందిన చెందిన 45 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారంతా కష్టపడి పనిచేయాలన్నారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

- వైసీపీ ఇంటికి పోయేది ఖాయం
- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 25: ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్న వ్యక్తి రాగద్వేషాలకు అతీతంగా పాలన సాగించాల్సింది పోయి దౌర్జన్యాలు, పోలీసుల కేసులంటూ ప్రతి ఒక్కరిని టార్గెట్ చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని సీఎం జగన్‌ను ఉద్దేశించి టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నందికొట్కూరులోని నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో జరిగిన వైసీపీ పాలన పట్ల ప్రజలు ఎంతో అసంతృప్తితో ఉన్నారన్నారు. ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను కలుస్తున్నామని, ఏ ఒక్క వర్గం ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై సంతృప్తిగా లేరని అన్నారు. 2024 ఎన్నికల్లో 10 స్థానాల్లోపే వైసీపీ పరిమితం అవుతుందని జోస్యం చెప్పారు. ప్రజల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నదని అన్నారు. వలంటీర్లతో వెట్టి చాకిరీ చేయించుకున్న జగన్‌పై వెట్టిచాకిరీ చట్టం కింద కేసులు నమోదు అవుతాయన్నారు. ఇసుక దందా చేసిన వారు రాశుల కొద్ది డబ్బులు సంపాదించారని, ఇసుక సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేశారని అన్నారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నంద్యాల పార్లమెంట్‌కు ఈ ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిని కడప నుంచి దిగుమతి చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో చెరకుచర్ల రఘురామయ్య, కట్టుబడి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

జూపాడుబంగ్లా, మార్చి 25: మండలంలోని 80 బన్నూరు గ్రామంలో సోమవారం నాగరత్నం అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు రాళ్లతో దాడిచేశారు. ఈ మేరకు ని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జాతీయ రహదారి కిందికి గ్రామంలోని శ్మశానవాటిక పోవడంతో నాగరత్నం అనుభవంలో ఉన్న డీపట్టా పొలంలో శ్మాశనం ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్, రెవెన్యూ అధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని ఖననం చేయడానికి తీసుకొని వెళుతుండగా నాగరత్నం అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన తిరుపాలు, వినోద్, సాయి, నవీన్ తదితరులు రాళ్లతో కొట్టడంతో నాగరత్నం తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిప్పగిరి, మార్చి 25 : ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేయడానికి నిల్వ ఉంచిన రూ.12 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యాన్ని చిప్పగిరి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామం వైసీపీ నాయకుడు విక్రాంత్ రెడ్డి క్వారీకి దగ్గరలో ఉన్న కొండలో 124 బాక్సుల కర్ణాటక మద్యాన్ని నిల్వ ఉంచినట్లు ఎస్పీ శ్రీకాంత్‌కు అందిన సమాచారం మేరకు ప్రత్యేక పోలీసు బృందం తనిఖీలు చేసి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. త్వరలో నిందితులను పట్టుకొని కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మహమ్మద్ రిజ్వాన్, పోలీసులు నజీర్ అహ్మద్, ఖాదర్ బాషా, సాగర్, యశ్వంత్, భాస్కర్, శంకర్, ఎన్నికల ప్రత్యేకాధికారులు ప్రకాష్, అంజనేయులు పాల్గొన్నారు.

ఆస్తుల వివరాలు బయటపెట్టే ధైర్యముందా..?

- మంత్రి బుగ్గనకు కోట్ల సవాల్
- ఆర్థిక క్రిమినల్ ప్రమాదకరమంటూ వ్యాఖ్య



డోన్‌లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసిన ఐటీడీపీ నాయకులు

డోన్, మార్చి 25: ఐదేళ్ల కాలంలో తన ఆర్థిక మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా సంపాదించిన ఆస్తుల వివరాలను బైట పెట్టే ధైర్యం బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ఉందా? అని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం డోన్ పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో కోట్లను నంద్యాల పార్లమెంటు ఐటీడీపీ నాయకులు నరేష్ బాబు, బాబా ఫకృద్దీన్, షంషుద్దీన్ కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక మంత్రి పదవిని బుగ్గన కేవలం తన ఆస్తులను పెంచుకోవడానికే ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. బుగ్గన లాంటి ఆర్థిక క్రిమినల్‌తో ప్రజలకు చాలా ప్రమాదకరమన్నారు. ప్రజలపై పన్నుల భారాలు మోపడం, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచడం అభివృద్ధి అంటారా అని ప్రశ్నించారు. రెండుసార్లు సీఎంగా, కేంద్ర మంత్రులుగా పని చేసిన తమ కుటుంబ ఆస్తులను ప్రజల ముందు ఉంచడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ఓబులాపురం శేషిరెడ్డి, మద్రి రమణ, లక్ష్మీనారాయణ యా దవ్, భాస్కర్ నాయుడు, ఓంప్రకాష్, ప్రభాకర్ రెడ్డి, మను, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సీమలో కొనసాగుతున్న బై బై జగన్ !

షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరికలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల్లో .. ముఖ్యంగా చిత్తూరు, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన రెడ్డి నియంతృత్వధోరణిని నిరసిస్తూ బయటకు వెళ్లిపోతున్న నేతల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైసీపీని వీడుతున్నవారంతా ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరుతున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన నంద్యాల జడ్పీటీసీ గోపవరం గోకుల్‌కృష్ణారెడ్డి వైసీపీకి సోమవారంనాడు రాజీనామా చేశారు. ఆయన హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలరెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా గోకుల్ కృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైసీపీకోసం ఎంతో కష్టపడ్డామని అన్నారు. అయినా తమకు గుర్తింపు లేదని వాపోయారు. పార్టీ కోసం చేసిన సేవలకు కనీసం మర్యాద కూడా ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తనపై విచక్షణారహితంగా ప్రవర్తించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని గోకుల్ కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడతానని చెప్పారు. పార్టీని అధికారంలోకి తీసుకువస్తామని వెల్లడించారు. కాగా వైసీపీ మహిళా నేత దువ్వెల సృజన, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య కుమార్తె దారా పద్మజ సోమవారంనాడు ఏపీసీసీ చీఫ్ షర్మిల రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఎస్వీ మోహన్‌రెడ్డి ఒక్కడే కావాలా..?

- మాతో పని లేకపోతే మేమెందుకు ఇక్కడ
- ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- మైక్, పేపర్లు నేలకేసి కొట్టి వెళ్లిపోయిన వైనం

కర్నూలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గాల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. మీకు ఎస్వీ మోహన్ రెడ్డి ఒక్కడే కావాలా..? మమ్మల్ని ఎందుకు పిలవడం లేదు..? మాతో అవసరం లేకపోతే మేమెందుకు ఇక్కడ ఉండాలి..? అంటూ కర్నూలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎం ఇంతియాజ్‌పై ఆ పార్టీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతో పని లేనప్పుడు ఇక్కడెందుకు ఉండాలి..?' అంటూ చేతిలో ఉన్న మైకు, పేపర్లు నేలకొసి కొట్టేసి ఆవేశంగా వెళ్లిపోయారు. సోమవారం జరిగిన ఈ ఘటన వైసీపీలో హాట్ టాపిక్‌గా మారింది. ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ఆఫీస్‌లోనే ఈ ఘటన జరిగిందని ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్ పర్సన్ ఎస్వీ విజయ మనోహరి దంపతులు, ఆయన వర్గానికి చెందిన కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలను వెంటబెట్టుకొని వైసీపీ అభ్యర్థి ఇంతియాజ్ ప్రచారం చేస్తున్నారు. ఇది ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు ఏమాత్రం రుచించడం లేదు. పైగా తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా హఫీజ్‌ఖాన్ ఆయన అనుచరుల వద్ద ఆవేదన వెలిబుచ్చినట్టు సమాచారం. మేము సిద్ధం పోస్టర్లు విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌ను ఉద్దేశపూర్వకంగానే ఇంతియాజ్ దూరం పెట్టారని ఎమ్మెల్యే వర్గీయులు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ ఆఫీస్ సమీపంలో వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లతో ఇంతియాజ్ సమావేశం నిర్వహించారు. అభ్యర్థి ఇంతియాజ్ సహా గోషాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి పలువురు నాయకులు హాజరయ్యారు. గతంలో జరిగిన మేము సిద్ధం పోస్టర్లు విడుదల కార్యక్రమానికి తమను ఎందుకు పిలవలేదని ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గానికి చెందిన వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మల్లికార్జున (మల్లి) నిలదీశారు. తమ వద్ద ఫోన్ నంబర్లు లేకపోవడంతో పిలవలేదని ఆది మోహన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. మాటామాట పెరగడంతో ఎమ్మెల్యే హఫీజ్ ఆగ్రహంతో ఊగిపోయారు. అదే క్రమంలో 'ఎస్వీ మోహన్‌రెడ్డి ఒక్కడితో కలిసి ప్రచారం చేస్తున్నారు.. మాకు చెప్పడం లేదు.. ఇదేమా ఎమ్మెల్యేగా మాకు ఇస్తున్న గౌరవం అంటూ' ఆవేశంతో చేతిలో ఉన్న మైక్, పేపర్లు నేలకేసి కొట్టి అక్కడి నుంచి ఆవేశంగా హఫీజ్‌ఖాన్ వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం నగరంలో వైసీపీలో ఇదే ప్రధాన చర్చగా మారింది.

'మాంటిస్సోరి'లో వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 25: నగర శివారులోని పంచలింగాల మాంటిస్సోరి పాఠశాలలో సోమవారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, విద్యాసంస్థల డైరెక్టర్ రాజశేఖర్ ప్రారంభించారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉందని అన్నారు. విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ఇయర్, అకడమిక్ ఎక్సలెంటు అవార్డు బహుమతులను టీజీ వెంకటేశ్, డైరెక్టర్ రాజశేఖర్ విజేతలకు అందజేశారు. అంతకుముందు వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ నృత్యాలు, మహిషాసురమర్దిని వంటి ప్రదర్శనలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్, డాక్టర్ కృష్ణమోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ నాగ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 25: నంద్యాల చెక్‌పోస్టు బజాజ్ ఎలక్ట్రానిక్స్ ఎదురుగా 300 ఎంఎం పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టడంతో 19, 20, 21 వార్డులకు రెండు రోజులపాటు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగు తుందని కమిషనర్ ఎ.భార్గవతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26, 27 తేదీలలో గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, చంద్రశేఖర్‌నగరు, మారుతినగర్, బృందావన్‌నగర్, సరస్వతి నగర్, జయరాం నగర్, ధనలక్ష్మినగర్, వాసవినగర్, బీటీఆర్‌నగర్, మాధవినగర్, కమలానగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీ, ఎస్బీఓస్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

కర్నూలు(న్యూసిటీ), మార్చి 25: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామంలో మృతి చెందిన చేనేత కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు చేసిన అన్యాయానికి చేనేత కుటుంబం పాల సుబ్బారావు, భార్య సద్మావతి, కుమార్తె వినయ్ ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. ఇందుకు కారకులైన వారిపై కేసు నమోదు చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంలో పెద్ద కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిం చాలని, కోల్పోయిన పొలాన్ని తిరిగి ఇప్పించాలని ఆయన కోరారు.

ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి



కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చింతా సురేష్‌బాబు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 25: ఉమ్మడి కర్నూలు జిల్లాలో టీడీపీ ఎంపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కో ఆర్డి నేటర్ చింతా సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఎంపీ అభ్యర్థుల స్వగృహా ల్లో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా చింతా సురేష్ బాబు మాట్లాడుతూ అభ్యర్థులకు ఉమ్మడి జిల్లాలో జనసేన తరపున సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, బజారి, సుధాకర్, షబ్బీర్, సతీష్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాలో ఏపీ నెంబర్-1

కర్నూలు(అర్బన్), మార్చి 25: గంజాయి అక్రమ రవాణాలో ఏపీ నెంబర్ 1 స్థానంలో నిలిచిందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల ప్రవీణ్ అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేశారని ధ్వజమెత్తారు. ఓటర్లను మత్తు పదార్థాలకు బానిసగా చేసి ఓట్లు దండు కోవాలని కుట్ర చేస్తున్నారని, రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో మెడికల్ కళాశాలలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పాలి

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు శ్రీనగర్‌కాలనీలో శంఖారావం సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ అధికార వైసీపీ పని అయిపో యిందని, ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగవుతుందని అన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, మాండ్రసీమ ప్రసాద్‌రెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్‌రెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, శ్రీరాములు అయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.

● యువతకు ఉద్యోగ భద్రత టీడీపీతోనే సాధ్యం: తెలుగుదేశం ప్రభుత్వంలోనే రాష్ట్రంలో యువతకు ఉద్యోగ భద్రత ఉంటుందని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం 29వ వార్డు బాలజీనగర్, విజ్ఞీనగర్, రుక్మిణీనగర్‌లో ప్రజల సమస్యలను తెలుసుకుని శంఖారావం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించగల సమర్థత ఉన్న నాయకుడు చంద్రబాబే అన్నారు. వైసీపీ పాలనలో ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోతు న్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు అమలు చేయ లేయలేని జగన్ పేదలపై చార్జీలు, పన్నుల భారాన్ని వేశారని విమర్శించారు. ప్రత్యేక హోదా, పోలవరం, రెవెన్యూలోటు, ప్రత్యేక రైల్వే జోన్, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, జాబ్‌క్యాలెండర్, మద్య నియంత్రణ గాలికొదిలేసి, రాష్ట్రంలో మైన్స్, వైన్, ల్యాండ్, శాండ్, భూ ఆక్రమణలతో వైసీపీ నాయకులు చెలరేగి పోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు, వీరేంద్ర, రామకృష్ణ, పుల్లయ్యగౌడ్, జనసేన నాయకుడు షబ్బీర్ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేశారు

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 25: తెలుగుదేశం ప్రభుత్వ హయంలో పెట్టుబడుల ఆకర్షణలో నెం-1 స్థానంలో రాష్ట్రం ఉంటే .. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం డ్రగ్స్ క్యాపిటల్‌గా మార్చేసిందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం మౌర్యఇన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తామన్న ప్రభుత్వం డ్రగ్ క్యాపిటల్‌గా చేసిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు మాత్రం ఏపిలోనే దొరుకుతున్నాయని పేర్కొన్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడిపోయాయన్నారు. డ్రగ్స్ విషయంలో వైసీపీ పెద్దల హస్తం ఉన్నందునే ఆ పార్టీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారని అన్నారు. డ్రగ్స్‌తో యువత భవిష్యత్ పాడైపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేదు.. ఈ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని టీజీ భరత్ అన్నారు. మౌర్యఇన్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం, కొత్త మాధవరం గ్రామానికి చెందిన చేనేత కుటుంబంలో పాల సుబ్బారావు, భార్య పద్మావతి, కుమార్తె వినయ ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని అన్నారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

టీడీపీతోనే భవిష్యత్తు: తెలుగుదేశం పార్టీతోనే యువతకు భవిష్యత్తు ఉంటుందని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని కొత్తపేట ప్రాంతానికి చెందిన యువకులు జేఎం బ్రదర్స్ ఆధ్వర్యంలో హనీఫ్ ఖాన్, తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అలాగే సత్యం గౌడ్ ఆధ్వర్యంలో బంగారుపేట యువకులు టీడీపీలో చేరారు. అనంతరం 49వ వార్డుకు చెందిన రామ్మూర్తి, కౌశిక్, ఉదయ్ ఆధ్వర్యంలో యువకులు టీడీపీలో చేరారు. మౌర్యఇన్‌లో జరిగిన కార్యక్రమంలో టీజీ భరత్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. అంతకముందు 9, 10 వార్డులకు చెందిన పలువురు గౌస్ ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో తెలుగు యువ త రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్కీటూ గోపి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన యువకులతో టీజీ భరత్

టీడీపీలోకి సి.బెళగల్ వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 25: కోడుమూరు నియోజకవర్గంలోని సి. బెళగల్‌కు చెందిన రామ్‌చరణ్, వీరారెడ్డి, వెంకటరాముడు, చిన్నరాముడు, గోవిందు, బీటీ నాయుడు, శాంతన్న, శ్రీనివాసులు, రంగ ముని, ఈరన్న వైసీపీకి గుడ్‌బై చెప్పారు. సోమవారం వారు కర్నూలులో టీడీపీ నాయకుడు విష్ణువర్దన్‌రెడ్డి నివాసంలో కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి దస్తగిరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతు సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరు సైని కుడిగా పనిచేసి కోడుమూరులో టీడీపీ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు.

● కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం, వెంగన్నబావి చెందిన వైసీపీ నాయకుడు మధు ఆధ్వర్యంలో దాదాపు 40కుటుంబాలు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి దస్తగిరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో తేజ, శ్యామ్, రవి, మని, అఖీల్, నాగేంద్ర, సలీం, శేషన్న, అంజి, అన్వర్, రాజు, చిన్నసోమన్న, సాయి, యస్వారాజ్, మహబూబ్‌బాషా, కుమార్, సుమంత్, బాలు, కిశోర్, అభిలాష్, విజయ్, ప్రవీణ్ ఉన్నారు.



బొగ్గుల దస్తగిరి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీలో చేరిన కాటసాని సన్నిహితుడు



గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరుతున్న 19వ వార్డు వైసీపీ నాయకులు

కల్లూరు, మార్చి 25: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి ముఖ్య సన్నిహితుడు 19వ వార్డుకు చెందిన గుడిపాటి సుదర్శన్‌చౌదరి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో సుదర్శన్‌చౌదరితో పాటు వందమంది యువకులు పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నచ్చక వైసీపీని వీడుతున్నట్లు వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పురుగు పురుషోత్తంరెడ్డి, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 32వ వార్డు వైసీపీ నాయకులు: కల్లూరు అర్బన్ 32వ వార్డు గంగావతినగర్‌కు చెందిన చాపల రమేష్, ప్రకాష్, మాబాషా, మదు ఆధ్వర్యంలో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో 80 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం గౌరు దంపతులు వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

తిప్పాయిపల్లె వైసీపీ నాయకులు కూడా: ఓర్వకల్లు మండలం తిప్పాయిపల్లె గ్రామం వైసీపీకి చెందిన మాజీ సర్పంచు మొహమ్మద్‌బాషా, మహబూబ్‌బాషాతో పాటు 40 కుటుంబాలు మాజీ సర్పంచు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. గౌరు దంపతులు వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయండి

ఓర్వకల్లు, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పార్టీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, వేణుగోపాల్ రెడ్డి, అల్లాబాబు, ఆదాం బాషా పాల్గొన్నారు.

ముగిసిన చెన్నసోమేశ్వర స్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

సి.బెళగల్, మార్చి 25: మండలంలోని పోలకల్లు గ్రామంలో చెన్న సోమేశ్వర స్వామి రథోత్సవం సోమవారం ముగిసింది. ఆదివారం రాత్రి యాదవుల ఇంటి నుంచి ఆలయానికి కుంభం కాగులతో వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజామున గ్రామ పెద్దలు, అశేష భక్తుల సమక్షంలో రథోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. యాదవుల ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోడుమూరు సీఐ మన్సరుద్దీన్, గూడూరు, కర్నూలు త్రీటౌన్, సి.బెళగల్, కోడు మూరు ఎస్ఐలు హనుమంతప్ప, రామకృష్ణ, తిమ్మారెడ్డి, బాలనరసింహుడుతోపాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా హోలి

సి.బెళగల్, మార్చి 25: మండల కేంద్రమైన సి.బెళగల్‌తోపాటు కంబం దహల్, పోలకల్లు, కొత్తకోట, ముడు మాల, ఈర్లదిన్నె తదితర గ్రామాల్లో గ్రామాలలో హోలి పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలలో పూజలు నిర్వహించారు.

నేడు రైతుబజారులో క్లీనింగ్

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 25: నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్టేట్ అధికారి హరీష్ కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ సోమవారం తెలిపారు. రైతులు కూరగాయలను మంగళవారం రైతుబజారుకు తీసుకుని రావద్దని వారు విజ్ఞప్తి చేశారు.

వైసీపీ ఎమ్మెల్యే అనుచరుడు కాంగ్రెస్‌లోకి..

కర్నూలు(అర్బన్), మార్చి 25: వైసీపీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ ముఖ్య అనుచరుడు జాన్సన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం విజయవాడలోని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించింది. ఎమ్మెల్యేకు రాబోయే ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో ఆయన మనస్తాపానికి గురై పార్టీ మారినట్లు సమాచారం.

బండలాగుడు పోటీలు

సి.బెళగల్, మార్చి 25: మండలంలోని పోలకల్లులో చెన్న సోమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకుని రాష్ట్రస్థాయి బండలాగుడు, పొట్టేళ్ల పోటీలు, ముగ్గుల, కుర్చీల పోటీలు, పారువేట నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దల సమక్షంలో బహుమతులు అందజేస్తారు.



బండను లాగుతున్న ఎద్దులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శేష వాహనంపై ఊరేగుతున్న ఆది దంపతులు

కోడుమూరు(రూరల్), మార్చి 25: గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారు శేష వాహనంపై ఊరేగారు. మంగళవారం అర్ధరాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వ హించనున్నారు. గోరంట్ల, ఎర్రగుడి గ్రామస్థులు పెళ్లి పెద్దలుగా వ్యవహరిస్తారు. ముందుగా వరుడు మాధవుడి తరపున ఎర్రగుడి వాసులు ప్రభను మేళతాళాల మధ్య తీసుకుని హంద్రీనది మీదుగా ఆలయం చేరుకుం టారు. అనంతరం వధువు లక్ష్మీదేవి తరపు గోరంట్ల పెద్దలతో ఆచారుల ఇంట పెళ్లి తంతు మాట్లాడి తాంబూలం ఇచ్చిపుచ్చుకుంటారు. ఆపై ఉత్సవ మూర్తులను కల్యాణ మండపం చేర్చుతారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణం జరిపిస్తారు. అనంతరం గోరంట్ల, ఎర్రగుడి ప్రజలు కలిసి ఆది దంపతులను గరుడ వాహనంపై ఊరేగిస్తారు. ఇక్కడ స్వామిఅమ్మవార్ల కల్యాణంలో పఠించే మంత్రాల నడుమ పేద జంటలు పెళ్లి చేసుకునే సంప్రదాయం ఉంది. కాగా సోమవారం అర్ధరాత్రి హనుమంత వాహనంపై ఊరేగించారు. స్వామిఅమ్మవార్ల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు.

ఆంజనేయ స్వామికి పౌర్ణమి పూజలు



కొమ్ముచెరువు ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, మార్చి 25: మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామికి సోమవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు ఆకు పూజలు, కుంకుమార్చన చేశారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

నీలకంఠేశ్వరుడికి పూజలు

గూడూరు, మార్చి 25: గూడూరు పట్టణంలో వెలసిన భువనేశ్వరి నీలకంఠేశ్వర స్వామి, అమ్మవార్లకు సోమవారం ఆలయ పూజారి నాగరాజు అభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు, మహిళలు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నీలకంఠేశ్వర స్వామి భక్త బృందం పాల్గొన్నారు.

సుంకేసుల చెక్ పోస్టు తనిఖీ



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీఎస్పీ విజయశేఖర్

గూడూరు, మార్చి 25: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుంకేసుల ఏపీ - తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టును కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. అలాగే రేమట, సుంకేసుల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామస్థులంతా సహకరించాలన్నారు. డీఎస్పీ వెంట కోడుమూరు సీఐ మన్సురు ద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య ఉన్నారు.

ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్ కుట్ర

కర్నూలు(రూరల్), మార్చి 25: రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసీపీ పాలనలో ప్రజల మాన, ప్రాణ ఆస్తులకు రక్షణ లేదన్నారు. ఏపీలో సహజవనరులను దోచుకున్నంత సులువుగా వైసీపీ నాయ కులు ప్రజల స్థిరాస్తులను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. కడప జిల్లాల్లో వైసీపీ మహిళా నాయకురాలి దౌర్జన్యానికి ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలో చేనేత కుటుంబానికి చెందిన సుబ్బారావు ఆయన భార్య కూతురు బలైపోయారన్నారు.

ఉత్తమ నాయకుడిని ఎన్నుకోవాలి: టీజీ భరత్



ప్రజలతో మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ నాయకుడిని ఎన్నుకోవాలని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ప్రజలకు సూచించారు. సోమవారం నగరంలోని శ్రీరాంనగర్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గున్నా మార్క్, ఆర్జా రామకృష్ణ, అజయ్, ఉదయ్ భాస్కర్, దాస్, మల్కల్, భరత్, ప్రేమ్, వర్ధన్, వినయ్, జుబేర్, మణి, ప్రదీప్, జనసేన నాయకులు పవన్, రమేష్, చందు, పండు పాల్గొన్నారు.

నీటి తొట్లు.. నీరు ఉంటే ఒట్టు

దాహంతో అల్లాడుతున్న మూగజీవాలు



ఓర్వకల్లులో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

ఓర్వకల్లు, మార్చి 25: ప్రభుత్వం మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు వేల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన పశువుల నీటి తొట్లు అలంకార ప్రాయంగా మారాయి. ప్రభుత్వం మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నీటి తొట్లు నిర్మించింది. అయితే అవి నీరు లేక నిరుపయోగంగా మారాయి. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, శకునాల, తిప్పాయపల్లె, తదితర గ్రామాల్లో 25 నీటి తొట్లు నిర్మించారు. వీటిల్లో చుక్క నీరు లేక పశువుల దాహం తీరడం లేదు. ఒక్కో తొట్టి నిర్మాణం కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.20 వేలు కేటాయించింది. తొట్లకు గ్రామ పంచాయతీ అధికారులు పైపులైన్ కలెక్షన్ ఇచ్చి నీటిని నింపితే మూగజీవుల దాహార్తి తీరే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తొట్లను నీటితో నింపి మూగజీవుల దాహార్తిని తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మేతకు వెళ్తున్న ఆవులు

నీటి తొట్టి ఉన్నా ప్రయోజనం శూన్యం



గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పశువులకు, మూగ జీవులకు దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం నీటి తొట్లు నిర్మించినా ప్రయోజనం లేదు. ఏ ఒక్క నీటి తొట్టిలో నీరు నిల్వ ఉండకపోవడంతో మూగజీవాలు తాగునీరు లేక అల్లాడిపోతున్నాయి. అధికారులు స్పందించి నీటి తొట్టిలో నీటిని నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలి.

- రామకృష్ణ, సీపీఎం నాయకుడు

మూగజీవాలను పట్టించుకోండి



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లను ఏర్పాటు చేశారు. అప్పట్లో పశువులకు దాహార్తి తీర్చేవారు. ప్రస్తుతం నీటి తొట్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో మూగజీవాలు ఎండలు ఎక్కువై నీటి కోసం అల్లాడుతున్నాయి.

- అబ్దుల్లా, రైతు

నిధులు దుర్వినియోగం



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు తొట్లు నిర్మించింది. అయితే నిర్మాణంలో తిలోదకాలు ఇవ్వడంతో నిధులు దుర్వినియోగమయ్యాయి. నీటి తొట్టిలో నీటిని నిల్వ ఉంచి పశువుల దాహార్తిని తీర్చాలి.

- గొల్ల నాగరాజు, రైతు

ఆలూరులో 15 రోజులకోసారి

● తీవ్రతరమవుతున్న తాగునీటి ఎద్దడి
● తగ్గిపోయిన బాపురం రిజర్వాయర్ సామర్థ్యం
● గ్రామాల్లో నీటి కోసం వైసీపీ అభ్యర్థిని నిలదీస్తున్న జనం



తోపుడు బండ్లు, సైకిళ్లపై నీటి కోసం పరుగులు పెడుతున్న ఆలూరు వాసులు, వాటర్ ట్యాంకుల వద్ద నీటిని పట్టుకుంటున్న దృశ్యం

ఆలూరు, మార్చి 25 : ఏ కాలమైనా సరే ఆలూరులో మాత్రం తాగు నీటి సమస్య మాత్రం తీరడం లేదు. వేసవి కాలం కావడంతో ఈ సమస్య మరింతగా తీవ్ర తరమైంది. ప్రభుత్వాలు, పాలకులు మారినా తాగునీటి సమస్య మాత్రం పరిష్కరించే నాధుడే కరవయ్యారు. ఆలూరు పట్టణంలో 15 రోజులకు ఒకసారి కూడా తాగునీరు సరఫరా కావడం లేదంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి చెప్పనక్కర్లేదు.

● **కురుకుందలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిలదీత :** ఆలూరు వైసీపీ అభ్యర్థి విరుపాక్షి ఆ గ్రామ సర్పంచు దేవిరెడ్డిని గ్రామస్థులు నిలదీశారు. "తాగునీటి సమస్యతో తల్లడిల్లుతున్నాం. ఎన్నిసార్లు అడిగినా సమస్య పరిష్కరించలేదు. ఏమి చేశారని ఓట్లడగడానికి వచ్చారు..' అంటూ నిలదీశారు. దాదాపు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అభ్యర్థులకు ప్రచారంలో ప్రజల నుంచి ఇలాంటి పరిస్థితే ఎదువుతుండడం గమనార్హం.

● **తాగునీటి సమస్యపై తీవ్ర నిర్లక్ష్యం :** పట్టణంలో దాదాపుగా 27 వేలకు పైచిలుకు జనాభా ఉంది. మొత్తం 9 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. దీనితో పాటు లక్ష లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక స్టోరేజి ట్యాంకు ఉంది. 40 ఏళ్ల క్రితం అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బాపురం రిజర్వాయర్ నుంచి ఆలూరుతో పాటు 22 గ్రామాలకు నీరు సరఫరా కావాల్సి ఉంది. ఇప్పుడున్న జనాభాకు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న బాపురం రిజర్వాయర్‌కు నీరు సరిపోవడం లేదు. దీనికి తోడు నిత్యం సాంకేతిక కారణాలు తల్లేతుతుండటం, లీకేజీలు, మరమ్మతులు, పైప్‌లైన్లు పగిలిపోవడంతో నీటి సమస్యకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. దీంతో 15 రోజులు అయిన నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలకు సమాధానం చెప్పలేక వాటర్ మ్యాన్‌లు స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు. గతంలో మాదిరిగా బాపురం రిజర్వాయర్ నుంచి పంపింగ్స్ సమయం తగ్గించారని, అందుకే ఈ సమస్య ఏర్పడిందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని ఈఓఆర్‌డీ ప్రకాష్‌నాయుడు తెలిపారు.

● **నీటి సమస్యపై ముందస్తు ప్రణాళిక ఏది.?:** తాగునీటి సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల ఏళ్ల తరబడి ఈ సమస్య తీరడం లేదు. ఈ విషయంలో ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు ముందస్తుగా సమావేశాలు నిర్వహించిన దాఖలు లేవు. దీంతో ఏళ్లు గడిచినా నీటి సరఫరా అస్తవ్యస్తంగానే ఉంది.

● **మరో రెండు స్టోరేజ్ ట్యాంకులు నిర్మిస్తేనే :** బాపురం రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి, ఆలూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ ట్యాంకుతో పాటు ఆలూరు చెరువులో ఒక్కటి, అరికెర రోడ్డులో మరొకటి నిర్మిస్తే ఎల్ఎల్‌సీ కాల్వలకు నీరు వదిలినప్పుడు, వాటిని నింపుకొని నిరుపయోగకరంగా ఉన్న ఆలూరు చెరువును నింపితే, ఆలూరుకు నీటి సమస్య తీరుతుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూర్ కిషోర్ తెలిపారు. దీనికి తోడు నీటిని సక్రమంగా ఉపయోగించి, వృధాగా నీటిని కాలువలకు వదలడం, వాహనాలు కడగడం, ఇళ్ళ ముందు చల్లడం వంటి వాటిని చేయవద్దని ఆలూరు సర్పంచ్ అరుణదేవి కోరారు.

● **క్యాన్ వాటర్‌కు పెరిగిన గిరాకీ :** ఆలూరు పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో 15 రోజులు గడిచినా సక్రమంగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు రూ.15 చెల్లించి వాటర్ క్యాన్లను కొంటున్నారు. దీంతో ఆలూరు పట్టణంలో వాటర్ ప్లాంట్లు అడుగడుగునా వెలిసి నీటి వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.

● **తాగునీటి సమస్య పరిష్కరించాలి**

ఆలూరులో 15 రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. ఎండాకాలం కావడంతో సమస్య మరింత తీవ్రతరంగా మారింది. నీటి కోసం బోర్లను ఆశ్రయిస్తున్నాం. ఏళ్లు గడిచినా సమస్యను పరిష్కరించే నాథులే లేరు.

- నాగన్న, ఆలూరు

● **ముందస్తు ప్రణాళిక లేకపోవడమే...**

ఏళ్ల తరబడి ఆలూర నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. 15 రోజులకు ఒక్కసారైనా తాగునీరు సక్రమంగా రాకపోతే ఎలా....? అధికారులు, ప్రజాప్రతినిధులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడమే ఇందుకు కారణం. వేదవతి, నగరడోణ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణాలు కూడా పూర్తి చేయలేదు. బాపురం రిజర్వాయర్ సామర్థ్యం పెంచి, సమ్మర్ స్టోరుజీలు నిర్మించాలి. నిరుపయోగంగా మారిన ఆలూరు చెరువును నింపితే సమస్య పరిష్కారం అవుతుంది.

- నారాయణ స్వామి, సీపీఎం నాయకుడు, ఆలూరు

ఘనంగా సుబ్రమణ్యేశ్వరస్వామి రథోత్సవం



దవడలకు ఇనుప శూలాన్ని గుచ్చుకుని రథోత్సవంలో పాల్గొన్న భక్తుడు

ఎమ్మిగనూరుటౌన్, మార్చి 25: పట్టణంలోని సోమప్ప నగర్‌లో సుబ్రమణ్యేశ్వరస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్థానిక పాత అంజనేయస్వామి దేవాలయం దగ్గర ఉన్న శమీవృక్షం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే భక్తులు మొక్కులు తీరాలని దవడలకు ఇనుప శూలాలను గురువు ఒక్కొక్కరికి గుచ్చారు. అలాగే మహిళాభక్తులకు సైతం దవడలకు ఇనుపశూలాలను గుచ్చుకొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉత్సవమూర్తిని అధిష్ఠించి రథాన్ని లాగే భక్తుడితో పాటు మరో ఇద్దరు రెండు ఇనుప కొక్కీలను వీపుకు గుచ్చుకొని రథాన్ని పురవీధుల గుండా ఆలయం వరకు లాగారు. ఈ సందర్భంగా చిన్నారులు, పెద్దలు అత్యంత భక్తితో కావళ్లతో నృత్యం చేస్తుస్వామివారికి స్వాగతం పలుకుతూ రథోత్సవాన్ని నిర్వహించారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

హొళగుంద, మార్చి 25 : ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన మార్లమడికి సచివాలయం ముద్దటామాగి గ్రామానికి చెందిన తలారి లక్ష్మన్న అనే వలంటీర్‌ను విధులు నుంచి తొలగించినట్లు ఎంపీడీవో ఆజాద్ సోమవారం తెలిపారు. వలంటీర్ ఆలూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి ముద్దటామాగి గ్రామంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్ పాల్గొన్నట్లు పత్రికల్లో ప్రచురితం కావడంతో పాటు, అధికారుల విచారణలో తేలడంతో వలంటీరను తొలగించినట్లు తెలిపారు. కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు పేర్కొన్నారు.

జనసేన వెంకప్పకు అవకాశం ఇవ్వాలి

ఆలూరు, మార్చి 25 : జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్పకు పొత్తులో భాగంగా అసెంబ్లీ స్థానానికి అవకాశం కల్పించాలని ఆస్పరి, హొళగుంద మండలాల జనసేన పార్టీ కన్వీనర్లు అరవింద్ కుమార్, అశోక్ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వెంకప్పకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే టీడీపీ, బీజేపీ నాయకుల సహకారంతో భారీ మెజారిటీతో గెలిపిస్తామన్నారు.

హోలీ సంబరాలు



ఆదోనిలో రంగులు పూసుకుని కేరింతల కొడుతున్న చిన్నారులు

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 25 : జిల్లా వ్యాప్తంగా హోలి సంబరాలు ఆనందోత్సాహాల మధ్య యువత నిర్వహించుకున్నారు. ఆదోని పట్టణంలో ఉదయం నుంచి చిన్నారులు, యువత రోడ్డుపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని ఆనందాలు పంచుకున్నారు. ఆటపాటలతో కేరింతలు కొడుతూ సాంప్రదాయ రంగులను జల్లుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతి వీధిలో చిన్నా, పెద్ద తేడా లేకుండా రంగుల్లో మునిగి తేలారు.

'ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు'

హాలహర్వి, మార్చి 25 : ఛత్రగుడి చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు మద్యం, అక్రమ రవాణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య అన్నారు. సోమవారం ఛత్రగుడి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో నాటుసారా, బెల్టుషాపులు లేకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

ఎలా బతకాలి?

మద్దికెర, మార్చి 25: కుటుంబ పోషణ కోసం ఉపాధి పనులకు వెళితే.. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, ఎలా బతకాలని ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో మొత్తం 11 గ్రామాలున్నాయి. 10వేల జాబ్‌కార్డులున్నాయి. ప్రతిరోజూ దాదాపు 4వేల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉపాధి పనులు చేస్తూ వస్తున్నారు. రెండు నెలలుగా కూలీలు రాకపోవడంతో కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించు కుంటున్నామని, ఆ డబ్బులు అయిపోవడంతో కిరాణం దుకాణాల యజమానులు తమకు సరుకులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏపీవో నర్సిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఆన్‌లైన్ చేశామని, నిధులు వచ్చిన వెంటనే వారి ఖాతాల్లో వేతనాలు వస్తాయనీ తెలిపారు.

అర్ధరాత్రి రోడ్డుపై ద్విచక్ర వాహనం దగ్ధం

దేవనకొండ, మార్చి 25: నేలతలమర్రి రహదారిపై గుర్తు తెలియని వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం ఆదివారం అర్ధరాత్రి దగ్ధం కావడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. సోమవారం ఉదయం ఆ రోడ్డుపై అటుగా వెళ్తున్న వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నిత్యం రాకపోకలున్న రహదారిపై గుర్తు తెలియని వ్యక్తికి చెందిన ద్వీచక్రవాహనం దగ్ధం కావడంపై ఇది ప్రమాదమా..? లేక వేరే ఏదైనా అని పోలీసులు తేల్చాల్సి ఉందని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న యువకులు

ఎమ్మిగనూరు, మార్చి 25: పట్టణంలోని 12వ వార్డుతో పాటు ఆయా వార్డులకు చెందిన పలువురు వైసీపీకి చెందిన యుకులు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే స్వగృహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన యువకులు ఇంతియాజ్, నవజ్, నిస్సార్, రహంతుల్లా, బడేసాబ్, బాషా, మున్నా, రియాజ్, ఇస్మాయిల్, రాఘవేంద్రలతో పాటు మరో వంద మంది టీడీపీలో చేరారు. వీరిని మాజీ ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ వైసీపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని విమర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ఎంతో సమయం లేదని పార్టీ గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని నాలుగో వార్డు సోగనూరు రోడ్డులో పర్యటించారు. వార్డు టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్, నాయకులు కొండయ్య చౌదరి, కౌన్సిలర్ దయాసాగర్, సుందరరాజు, రామకృష్ణ నాయుడు,కలీముల్లా, చేనేత మల్లి, రంగస్వామి గౌడ్, జయన్న, బచ్చాల రంగన్న పాల్గొన్నారు.

ఏపీని డ్రగ్స్‌ఆంధ్రగా మార్చిన ఘనత జగన్‌దే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 25: వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి రాష్ట్రాన్ని డ్రగ్స్ అంధ్రగా మార్చిన ఘనత సీఎం జగన్ రెడ్డికే దక్కుతుందని మంత్రాలయం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. సోమవారం సొంత గ్రామమైన మాధవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం తెచ్చిన సంక్షేమ పథకాలన్ని వెల్లగొట్టి ఎన్నికల ముందు విశాఖ ఐటీ పేరుతో మాయమాటలు చేస్తున్నాడనీ ఆరోపించారు. ఆంధ్ర వినాశనానికి జగన్ రెడ్డి యువతకు గంజాయి, డ్రగ్స్ ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైజాగ్‌లో 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడటం నిదర్శనమన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమైందని, చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి ప్రజలు గుర్తించుకుంటారనీ అన్నారు. జగన్ రెడ్డి మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని బీజేపీ, జనసేన, టీడీపీ సమిష్టిగా చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలన్నారు.

సన్మానం : పెద్దకడుబూరు మండలంలోని ముచ్చుగిరి గ్రామానికి చెందిన వాల్మీకులు, కురువ సామాజిక వర్గీయులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డిని కలిసి శాలువ, పూలమాలలతో సన్మానించారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిల్ పంపిణీ చేస్తున్న ఆర్డీటీ సంస్థ స్పెయిన్ దేశస్థులు

తుగ్గలి, మార్చి 25: సుదూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ వచ్చి విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం ఆర్డీటీ సంస్థ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. సోమవారం మండల పరిధిలోని పగిడిరాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో స్పెయిన్ దేశస్థుల చేతుల మీదుగా 70 మంది విద్యార్థులకు 70 సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ రామేశ్వరి, ఏపీఎల్ రెహనాబీ మాట్లాడుతూ పేదలకు ఆర్డీటీ సంస్థ ఉచిత ఇళ్లు కట్టించడంతో పాటు విద్య, వైద్యం కూడా అందిస్తుందన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు వారి చదువులు పూర్తయ్యేంత వరకు ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో చదువులు చెప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సభ్యులు వెంకటేశ్, భవాని, రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు భీమేష్, సీఆర్‌పీ నాగేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నాగలదిన్నె ఇసుక రీచ్ సబ్ కలెక్టర్ తనిఖీ

నందవరం, మార్చి 25: నాగలదిన్నె దగ్గర ఉన్న ఇసుక రీచ్‌ను సబ్ కలెక్టర్ శివ నారాయణశర్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుకను తీశారా తేదా విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్నారా అధికారులను విచారించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, తహసీల్దారు ఓబులేసు, సర్వేయర్ శ్రీనివాసరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జర్మియా, వీఆర్వో, పంచాయతీ అధికారి పాల్గొన్నారు.

సురేష్ కుమార్‌కు టీడీపీలో సముచిత స్థానం

పత్తికొండ టౌన్, మార్చి 25: పత్తికొండలో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందిన సురేష్ కుమార్‌కు టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పదవి ఇచ్చి పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర అన్నారు. సోమవారం కోర్టు ఆవరణంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ కుమార్‌ను తుగ్గలి నాగేంద్ర, ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ వరలక్ష్మిలు శాలువ కప్పి, పూలమాలతో న్యాయవాదుల సమక్షంలో సత్కరించారు.

ఆస్పరిలో డాగ్ సెర్చ్ తనిఖీలు

ఆస్పరి, మార్చి 25 : మండల కేంద్రం ఆస్పరిలో సోమవారం పోలీసు జాగిలాలతో ఆస్పరి సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో బొరుగుల బట్టిలో సోమవారం ఉదయం పడి ఉన్న రక్తపు మరకలను గమనించిన బట్టి యజమాని స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు జాగిలాలతో సంఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు నిర్వహించారు. బొరుగుల బట్టితో పాటు పక్కనే ఉన్న చర్చి ఆవరణంలో కూడా రక్తపు మరకలు కనిపించడంతో అక్కడ కూడా తనిఖీలు నిర్వహించారు.

స్థానికేతరులకు టికెట్ కేటాయిస్తే సహకరించం

● మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ఆదోని టౌన్, మార్చి 25 : ఎన్నికల పొత్తులో భాగంగా బీజేపీకు కేటాయించిన ఆదోని అసెంబ్లీ నుండి పోటీ చేయడానికి స్థానికేతరులకు అవకాశం కల్పిస్తే సహకరించేది లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అన్యభాష రాష్ట్ర కన్వీనర్ ఎస్ ప్రకాష్ జైన్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలతో నేరుగా సత్సంబంధాలు లేని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తికి పోటీ చేయడానికి ఎలా టికెట్ కేటాయిస్తారని విమర్శించారు. అభివృద్ధిని పాతరేసి, కేవలం బటన్ నొక్కుతూ సంక్షేమం పేరుతో నగదు పంపిణీ చేస్తూ, ప్రజల అసంతృప్తిని మూట కట్టుకొన్న అధికార పక్షం ఓటమి కోసమే కూటమి ఏర్పడిందని, గెలుపును అందుకోవాల్సిన సమయంలో స్థానికేతరులకు టికెట్ కేటాయించడం పై పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలికి ఫిర్యాదు చేశామన్నారు. స్థానిక అన్ని సామాజిక వర్గాలతో పాటు, మైనారిటీలతో సత్సంబంధాలను కలిగి ఉన్నామని, అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నామని పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా పార్టీ టికెట్ ఆశిస్తున్నానని, కొందరు జిల్లా నాయకులు తనకు టికెట్ రాకుండా తప్పుడు సాంకేతాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టూరిస్టులుగా వచ్చి పోయే వారికి కాకుండా స్థానికులకే టికెట్ ఇస్తే గెలిచే అవకాశం ఉందని పార్టీ అధిష్ఠానానికి సూచించామని అన్నారు.

ఆదోని సీటు టీడీపీకే : మీనాక్షినాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, మార్చి 25 : టీడీపీ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడొద్దని, ఆదోని సీటు ఇంకా ఎవరికి కన్ఫార్మ్ కాలేదని, పొత్తులో భాగంగా టీడీపీకే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడి స్వగృహంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కలిశారు. మీనాక్షినాయుడు మాట్లాడతూ సోషల్ మీడియా వార్తలను ఎవ్వరూ నమ్మవద్దని, ఆదోని టీడీపీకే సీట్ కన్ఫార్మ్ అవుతుందని అన్నారు. పొత్తులో భాగంగా బీజేపీ అడుగుతున్నప్పటికీ అధిష్ఠానం తీసుకుంటున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. నియోజకవర్గం టీడీపీ కంచుకోట అని, గెలిచే సీటును ఎవ్వరూ వదులుకోరని ఖచ్చితంగా తనకే కేటాయిస్తారంటూ చెప్పడంతో కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన లభించింది. టీడీపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, మాజీ ఎంపీటీసీ రంగన్న, పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి- నలుగురిపై కేసు నమోదు

గోనెగండ్ల, మార్చి 25: నెరుడుప్పల గ్రామానికి చెందిన బోయ చిన్నరాముడుపై ఆదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు. బోయ చిన్నరాముడు తన పాత ఇంటిని తొలగించి కొత్త ఇళ్లు నిర్మించుకోవాలని పాత ఇంటి మట్టిని ట్రాక్టర్‌తో ఇతర ప్రాంతానికి తోలుతున్నాడు. మట్టిని ట్రాక్టర్‌లో తీసుకువెళ్లే సమయంలో ఇంటి పక్కన ఉన్న వారి నాపరాతి బండకు ట్రాక్టర్ తగిలి బండ పగిలిపోవడంతో బోయ కేశన్న, వెంకటేష్, మల్లికార్జున, జయమ్మ బోయ చిన్నరాముడి పై కర్రల తో దాడి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

నందవరం, మార్చి 25: మండల పరిధిలోని నాగలదిన్నె చెక్‌పోస్టు దగ్గర ఎస్ఐ తిమ్మయ్య సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుడంగా కర్డాటక మద్యంను పట్టుకున్నారు. ఎమ్మిగనూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన నల్లబోతుల నాయుడు కర్డాటక మద్య ఒరిజనల్ చాయిస్, టెట్రా ప్యాకెట్లను తెస్తుండగా స్వాధీనంచేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళాలు

కౌతాళం, మార్చి 25: ఉరుకుంద ఈరన్న ఆలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి నగదును విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషర్, ఈఓ వెంకటేష్, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ తెలిపారు. హైదరబాదుకు చెందిన గంట హనుమంతప్ప కుటుంబ సభ్యులు రూ.1,00,116 చెక్కును, కర్నూలుకు చెందిన గ్రండే శ్రీనివాసులు, శ్రీలత దంపతులు రూ.50,000 నగదును విరాళంగా సమర్పించారు.

టీడీపీలోకి 60 కుటుంబాలు



శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు

వెల్దుర్తి, మార్చి, 25 : పట్టణానికి చెందిన 4, 14, 15 వార్డులకు చెందిన 60 కుటుంబాలు టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కేఈ శ్యాంబాబు సమక్షంలో ఆ ఆ పార్టీలో చేరారు. సోమవారం ఎల్.బండ, ఎల్.తండా, దాసరదొడ్డి, పుల్లగుమ్మి గ్రామాల్లో శంఖారావం కార్యక్రమం చేపట్టారు. టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. వెల్దుర్తి టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పుకొని టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, జయరాముడు, విజయమోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, రాజునాయక్, అమర్‌నాథ్‌గౌడ్, రామకృష్ణాచారి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ఆలూరు, మార్చి 25 : ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పంచాలింగాల నాగరాజుకు టీడీజీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూర్ కిషోర్ కలిసి విన్నవించారు. సోమవారం ఆయనను కలిసి నివేదికను సమర్పించారు. ఏళ్ల తరబడి తాగు, సాగునీటి కోసం ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు : డీఎస్పీ

మంత్రాలయం, మార్చి 25: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నియామవళి నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య అన్నారు. సోమవారం రాత్రి మంత్రాలయం మండలం లోని ఖగ్గల్లు గ్రామంలో మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విదంగా అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది వీరాంజనేయులు, భాస్కర్, వీరేష్, గురుమూర్తి పాల్గొన్నారు.

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

● 16 ఓట్లతో న్యాయవాది రంగస్వామి విజయకేతనం



ఓటు హక్కు వినియోగించుకుంటున్న తుగ్గలి నాగేంద్ర దంపతులు

పత్తికొండ టౌన్, మార్చి 25: పత్తికొండ పట్టణంలో సోమవారం జరిగిన బార్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి న్యాయవాది బి.రంగస్వామి, మరో న్యాయవాది వై.శ్రీనివాసరెడ్డి పోటీ పడ్డారు. స్థానిక కార్యాలయంలో ఎన్నికల అధికారి మైరాముడు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు జరిగాయి. 5గంటల వరకు ఓట్ల లెక్కింపు నిర్వహించారు. రంగస్వామికి 53 ఓట్లు రాగా, శ్రీనివాసరెడ్డికి 37 ఓట్లు వచ్చాయి. అందులో ఒక ఓటు ఇన్‌వాలిడ్ అయింది. 16 ఓట్లతో న్యాయవాది బి.రంగస్వామి అధ్యక్షులుగా విజయం సాదించారు. బార్ అసోసియేషన్‌లో మొత్తం 96 మంది సభ్యులుండగా.. 91 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్, న్యాయవాదులైన తుగ్గలి నాగేంద్ర, ఆయన సతీమణి మాజీ జడ్పీటీసీ వరలక్ష్మి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఎన్నికల్లో విజయం సాదించిన రంగస్వామికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నిక కావడానికి సహకరించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ బార్ అసోసియేషన్ అభివృద్ధికి అందరి సహకారంతో పాటు పడుతానని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్నికల సహాయ అధికారులుగా మధుబాబు, ప్రసాద్‌బాబులు వ్యవహరించారు.